కదనభేరికి కదలిరావాలి

- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి, మార్చి11: చలో కరీంనగర్ కదనభేరికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో కదిలిరావాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పిలుపు మేరకు మంగళవారం కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న చలో కరీంనగర్ కదనభేరికి నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, రైతుబంధు సమితి కో ఆర్డినేటర్లు , సభ్యులు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

మక్కాన్‌సింగ్ తప్పుడు ప్రచారం మానుకో

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిలా అధ్యక్షుడు కోరుకంటి చందర్

- ఆ నిధులు తెచ్చిందే నేనే
- రామగుండంమాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, మార్చి 11: రామగుండం నియోజక వర్గ అభివృద్ధికి తన హయాంలో వచ్చిన నిధులను ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ తానే తెచ్చానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. గోదావరిఖనిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో డీఎంఎఫ్‌టీ ద్వారా రూ.54 కోట్లు, టీయూఎఫ్ఐడీసీ కింద రెండు విడుతలుగా రూ.100 కోట్లు తీసుకవచ్చానని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో ఆ నిధులు రావడం ఆలస్యమైందన్నారు. తీరా ఇప్పుడు నిధులు వచ్చాక ఇదే అవకాశంగా భావించిన ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ప్రజలు గుడ్డిగా నమ్ముతారని తానే నిధులు తీసుకవచ్చినట్లుకార్యకర్తలతో పాలాభిషేకాలు చేయించు కోవడం సిగ్గుచేటని విమర్శించారు. నియోజక వర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి నిధులు తీసుకవస్తే తాము కూడా స్వాగతిస్తామని చెపారు. కానీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన నిధులను పట్టుకొని తానే తెచ్చినట్లు కథలు చెప్పవద్దని సూచించారు. వచ్చిన నిధులను కూడా సక్రమంగా వినియోగించుకొంటూ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని హితవు పలికారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలనీ, ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. సమావేశం లో నాయకులు కౌశిక హరి, మురళీధర్ రావు, గోపు ఐలయ్య, పెంట రాజేశ్, మా దాసు రామ్మూర్తి, నాయకులు పాల్గొన్నారు.

నియంత పాలనకు భయపడేది లేదు

కోల్‌సిటీ, మార్చి 11: రామగుండం నియోజక వర్గంలో అప్పుడే నియంత పాలన మొదలుపెట్టారని, అరెస్టులతో గొంతు నొక్కే ప్రయత్నం చేయాలనుకోవడం అవివేకమని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర వాసంపల్లి ఆనంద్‌బాబు, నాయకులు ఈదునూరి నర్సింగ్, అక్కపాక సంపత్, మామిడిపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలోపార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తే నెల రోజుల తర్వాత అరెస్టు చేయడం కుట్రలో భాగమేనని ఆరోపించారు. అరెస్టులతో భయపెట్టాలని చూస్తే మళ్లీ ఉద్యమాలతో గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. రామగుండం నియోజక వర్గ అభివృద్ధికి ఐదేళ్ల పాటు సేవలందించిన మాజీ ఎమ్మెల్యే, పార్టీ నాయకుల అరెస్టులను వారు ముక్తకంఠంతో ఖండించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, GADDAM RANJITHA, R/o. 5-51/B, Shatrajpally, Vemulawada, Rajanna Sircilla, TS, Have changed my name as KALLEM RANJITHA, W/o. KALLEM THIRUPATHI REDDY NT-328086

★I, Tadaka Shylaja S/o. Laxman R/o. H.No. 2-3-30, Ashok Nagar, Sircilla TS have changed my name as Mora Shailaja W/o. Mora Srihari NT-328086

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

పీఎంఈ కేంద్రం ప్రారంభం

రామగిరి, మార్చి 11: సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలకు చెందిన ఉద్యోగులకు పీఎంఈ పరీక్షల కొరకు సెంటినరీకాలనీ డిస్పెన్సరీలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన కేంద్రాన్ని సోమవారం ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకర్ రావు ప్రారంభించారు. ల్యాబ్‌లో అప్‌గ్రేడ్ చేసిన సేవలను, కొత్త పరికరాలను ప్రారంభించారు. మొబైల్ మెడికల్ క్యాంపులలో ఉపయోగపడే బ్లడ్ సెల్ కౌంటర్, ఈసీజీ మెషిన్, సెట్రిఫ్యూజ్, స్పైరోమీటర్, డిజిటల్ బీపీ పరికరం తదితర వాటిని జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, కే వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో డీవైసీఎంఈ డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వైవి రావు, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, పీఓ రాధాకృష్ణ, సివిల్ డీజీఎం పద్మరాజు, ఎంవో కళ్యాణ్ చక్రవర్తి, పీఎం రవీందర్ రెడ్డి, డీవైపీఎం మారుతి, కిషన్ తదితరులున్నారు.

బోరు మోటర్ ప్రారంభం

ముత్తారం, మార్చి 11: మండలంలోని సీతంపేట లో సోమవారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య బోరు మోటర్‌ను ప్రారంభించారు. పెరికవాడలో నీటి సమస్య ఉండడంతో జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు ఎంపీపీ నిధులతో ఏర్పాటు చేసిన బోరును ప్రారంభించారు. నీటి సమస్యను తొలగించినందుకు జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌కు, ఎంపీపీ ముత్తయ్యకు పెరికవాడ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

ధర్మారం,మార్చి11: నర్సింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిని అక్రమించి కొందరు సాగు చేసిన పంటలను జిల్లా అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ సోమవారం పరిశీలించారు. భూముల ఆక్రమణపై ఇది వరకే ప్రజా పాలన గ్రామ సభల సందర్భంగా గ్రామస్తులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా తగిన విచారణ జరిపించి అర్హులకు భూములు పంపిణీ చేస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు.

మాపై చిన్న చూపెందుకు..?

- కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి
- కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారుల నిరసన

కలెక్టరేట్‌లో ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

పెద్దపల్లి, మార్చి 11(నమస్తే తెలంగాణ): పేదవాడి సొంతింటి కలను సాకారం చేసేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలను చేపటారు. జిల్లాలోని మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసింది. అయితే పెద్దపల్లిలో లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ చిన్న చిన్న మరమ్మతుల కారణంగా గత ప్రభుత్వం లబ్ధిదారులకు ఇండ్లు అప్పగించలేదు. ఎంపిక చేసి వారికి మంజూరు పత్రాలను అందజేసింది. పెద్దపల్లి మున్సిపాల్టీ పరిధిలోని చందపల్లి, కూనారం రోడ్లల్లో మొత్తంగా 484 ఇండ్లను నిర్మించి అప్పగించింది. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం సోమవారం నుంచే 'ఇందిరమ్మ ఇండ్లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతున్నది. పెద్దపల్లి మున్సిపాల్టీ పరిధిలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. కేటాయించిన ఇండ్లు తమకే ఇవ్వాలని కోరారు. కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారనే ప్రచారాలను వారు వ్యతిరేకించారు. కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వేళ గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులు ఆందోళనకు దిగడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వానికి మా మీద చిన్న చూపు ఎందుకు..? ఫ్లెక్సీని చేతభూని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కేటాయించిన ఇండ్లు మాకే ఇయ్యాలె

గత ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇండ్లకు మమ్ములను ఎంపిక చేసింది. అందరి ముందట డ్రా తీసి మాకు ఇండ్లు వచ్చినయి చెప్పిండ్రు. చిన్న చిన్న పనులు అయ్యేదున్నది ఆగుమన్నరు. సరే అని ఎదురు జూత్తున్నం.కైకిలు జేసుకొని బతికే టోళ్లం. మేం కిరాయిలు కట్టుకోలేకపో తు న్నం. మాకు కేటాయించిన ఇండ్లను మాకే ఇయ్యాలె. అధికారులు తిప్పి చ్చుకుంటుండ్రు గని ఇండ్లు ఇస్తలేరు. ఇండ్లు ఇస్తరా.. ఇయ్యరా.? ఇయ్యకపోతే తాళాలు పగులగొట్టుకొని ఉంటం.

-కనుకుంట్ల సంతోషిని, డబుల్ బెడ్రూం లబ్ధిదారు, సాగర్‌రోడ్

కిరాయిలు కట్టుకోలేకపోతున్నాం..

మాకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లు మాకు ఇయ్యాలే. కిరాయిలు కట్టలేక పోతున్నాం. నా కాళ్లు రెక్కలు పోయినై. చిన్న చిన్న పనులు జేసుకొని బతుకుతున్నం. ఆసరా పింఛన్ రెండు వేలు అస్తే, వాటితోని ఇంటి కిరాయి కట్టుకుంటున్నం. మాకు కేటాయించిన ఇళ్లు మాకు ఇయ్యాలే. లేకపోతే ఓ మందు డబ్బ తీసుకొని పొయ్యి ఆ ఇంటికాన్నే సత్త. ఇప్పటికైనా అధికారులు రావాలే. మా ఇండ్లు మాకు ఇయ్యాలే.

-పొత్తూరి రాజేశ్వరి, డబుల్‌బెడ్రూం ఇంటి లబ్ధిదారు అమర్‌నగర్ పెద్దపల్లి.

ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలి

పెద్దపల్లి, మార్చి11: ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపా లని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్‌లాల్ లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దరఖాస్తుల ను పరిశీలించి పరిష్కరించాని అధికారుల కు సూచించారు.

సమయ పాలన పాటించాలి

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కలెక్టరేట్‌లో విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, సూచించారు. తీరు మారకుంటే చర్యలు తప్ప వని హెచ్చరించారు. సమస్యల పరి ష్కారం కోసం కలెక్టరేట్‌లోని పలు కార్యాలయాలకు వస్తున్న ప్రజలతో సిబ్బంది బాధ్యతారహితంగా, అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి జిల్లా అధికారి తన కార్యాలయ పరిధిలో సమావేశం నిర్వహించుకొని ప్రజలతో వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజలకు సేవ చేసేందుకే ప్రభుత్వం జీతం చెల్లిస్తుందనే విషయాలన్ని ప్రతి ఉద్యోగి దృష్టిలో పెట్టుకోవాలన్నారు. నిర్ల క్ష్యం చూపితే చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని స్పష్టం చేశారు.

సదుపాయాల కల్పనకు కృషి

ప్రతి జిల్లా అధికారి కార్యాలయంలో అవసరమైన సదుపాయాల కల్పనకు సహకారం అందిస్తామని, ప్రతి జిల్లా అధికారికి తప్పనిసరిగా ప్రత్యేక క్యాబిన్ ఉండేలా అవసరమైన పార్టిషన్ చేసుకోవాలనారు. అదేవిధంగా కార్యాలయానికి అవసరమైన సామగ్రి, ఇతర వసతుల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. పెద్దపల్లి ఆర్డీవో సీహెచ్ మధుమోహన్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

రైతు రుణాల రెన్యువల్ పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ

పెద్దపల్లి, మార్చి11: బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు రెన్యువల్ చేసుకునేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మందిరంలో సోమవారం డీసీసీ జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు., ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 1854 కోట్ల పంట రుణ లక్ష్యానికి డిసెంబర్ చివరి నాటికి రూ. 833 కోట్లు, రూ. 330 కోట్ల వ్యవ సాయ టర్మ్ రుణాలకు రూ. 491 కోట్ల అందించామని బ్యాంకర్లు వివరించారు. పంట రుణాల లక్ష్య సాధనలో 44.92 శాతం ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ అంశం కారణంగా రైతులలో రుణాల రెన్యు వల్ పట్ల ఉన్న అపోహలు తొలగించాలని సూచించారు. వ్యవసాయ ఇన్ ఫ్రా కింద ప్రస్తుత సంవత్సరం దాదాపు రూ. 50 కోట్ల రుణాలు మంజూరు చేయాల్సి ఉండగా రూ. 6.17 కోట్లు మాత్రమే మంజూరు చేశామని, 12 శాతం లక్ష్యం చేరుకోవడం శోచనీయన్నారు. స్వశక్తి మహిళా సంఘాలు తీసుకునే రుణాలతో ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం 2024-25కు సంబంధించిన వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశం లో లీడ్ బ్యాంకు మేనేజర్ సీహెచ్ వెంకటేశ్, డీఆర్డీవో రవీందర్, వివిధ బ్యాంకు మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో భద్రతా వారోత్సవాల ముగింపు

జ్యోతినగర్, మార్చి 11: ఎన్టీపీసీలో జాతీయ భద్రతా వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ మేరకు ఎన్టీపీసీ ఈడీసీ మిలినీయం హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఫ్యాక్టరీస్ డైరెక్టర్ బీ రాజగోపాల్‌రావు, డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ గంగాధర్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్టీపీసీలో చేపడుతున్న భద్రతను ప్రశంసించారు. భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారం రోజుల పాటు జరిగిన వారోత్సవాల్లో అవగాహన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఇక్కడ ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు, తెలంగాణ ప్రాజెక్టు ఓఅండ్ఎం జీఎం ఎస్‌కె సాహు, ఉన్నతాధికారులు ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారని నోటీసులు

- మాజీ ఎమ్మెల్యేతో సహా 15 మందికి అందజేత

జ్యోతినగర్, మార్చి 11 : సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు రామగుండంలోని ఎన్టీపీసీ ఎస్ఐ టీ ఉదయ్‌కుమార్ పోలీస్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించిన నోటీసులు అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. గత నెల 6న ఎన్టీపీసీలోని లక్ష్మీనరసింహగార్డెన్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నాయకత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేశారని కాంగ్రెస్ ఎన్టీపీసీ పట్టణ ప్రధానకార్యదర్శి మెరుగు లింగయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ మాజీ ఎమ్మెల్యేతోపాటు బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు మొత్తం 15 మందిని నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా వారికి 41ఏ సీఆర్‌పీసీ నోటీసును అందజేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారిలో ఏ1గా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తోపాటు కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, క్రిష్ణవేణి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈదునూరి శంకర్, ఈదునూరి పర్వతాలు, పెగడపల్లి నారాయణ, గఫార్, బొడ్డుపల్లి శ్రీనివాస్, అచ్చె వేణు, బుల్లెట్ శ్రీను, జావిద్ పాషా, బాసంపల్లి శ్రీనివాస్, మూల విజయారెడ్డి, ఐత శివకుమార్, శ్రావణ్ ఉన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శ్రేణులు పోలీస్టేషన్‌లో స్టేషన్ బెయిల్ తీసుకున్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దపల్లి, మార్చి11: రాష్ట్రంలోని పలు రైల్వే స్టేషన్ల అధునీకరణ, పునరాభివృద్ధికి రూ. 5071 కోట్లు కేటాయించిన నేపథ్యంలో ప్రధాన మంత్రి పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలను మంగళవారం వర్చువల్ విధానంలో చేయనున్నారు. సల్తానాబాద్‌లో గతి శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్, రాఘవాపూర్‌లో గూడ్స్ షెడ్, పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్ స్టాల్‌కు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు.

గృహజ్యోతిని వినియోగించుకోండి

పెద్దపల్లి, మార్చి11: విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతిని వినియోగించుకోవాలిన విద్యుత్ శాఖ పెద్దపల్లి ఎస్ఈ బొంకూరి సుదర్శనం తెలిపారు. సోమవారం పట్టణంలో పలువురికి జీరో బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి కాలమ్‌లో యూఎస్‌సీ నంబర్ వేసిన వారికి ఇప్పుడు 200 యూనిట్ల వరకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీకి అర్హులయ్యారని తెలిపారు. యూఎస్‌సీ నంబర్ రాయని వారు ఎంపీడీవో/ మున్సిపల్ కార్యాలయంలో రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, యూఎస్‌సీ నంబర్ నమోదు చేసుకుంటే, ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వస్తుందని, ఆ ఓటీపీని ఎంటర్ చేస్తే జీరో బిల్లుగా మారి మెసేజ్ వస్తుందని వివరించారు.

'సదాశయ' జిల్లా కార్యవర్గం

కోల్‌సిటీ, మార్చి 11: సదాశయ ఫౌండేషన్ జిల్లా కార్యవర్గాన్ని గోదావరిఖని శారదానగర్‌లో జాతీయ అధ్యక్షుడు టీ శ్రవణ్‌కుమార్ సోమవారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఏ రాజమౌళి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా వెల్లె కవిత ఎన్నికయారు. గౌరవాధ్యక్షుడిగా చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా రాజమౌళి, ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా రాజలింగయ్య, సహ కార్యదర్శిగా యోగేశ్, సలహాదారులుగా దేవి లక్ష్మీనర్సయ్య, శంకర్, వైద్య సలహాదారులుగా డాక్టర్ సందీప్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, అనంత రాములు, కేఎస్ వాసు, శారద, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థుల సత్తా

విద్యార్థినిని అభినందిస్తున్న ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి

పెద్దపల్లి కమాన్, మార్చి 11 : జేఎన్టీయూహెచ్ ప్రకటించిన ఇంజినీరింగ్ ఫలితాల్లో పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగంలో ఫయాజ్ (93శాతం), తబసుం సుల్తానా (89), క ంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో నిఖిత (90), దీప్తి (89.5), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో శ్రీవర్షిని (87.7), శ్రీసహస్ర (86.6), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో భవాని (70.5) సాధించి అగ్రస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. సోమవారం ట్రినిటీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మణిగణేశ్, ఏవో సురేశ్, హెచ్‌వోడీ పద్మిని, ఆంజనేయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువులోపడి పశువుల కాపరి మృతి

పెద్దపల్లిరూరల్, మార్చి 11: పెద్దపల్లి మండలం రాగినేడు చెరువులో ప్రమాదవశాత్తు పడి ఓ పశువుల కాపరి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెపిన వివరాలిలా ఉన్నాయి కొత్తపల్లికి చెందిన పశువుల కాపరి రేవెల్లి రాయమల్లు(45) గ్రామానికి చెందిన పశువులను మేత కోసం పక్క గ్రామమైన రాగినేడు శివారులోకి తోలుకు వెళ్లారు. అయితే పశువులతో ఇద్దరు మనుషులు రాగా, చెరువులోకి దిగిన పశువు లను బయటకు కొట్టుకు రావడానికి రాయమల్లు చెరువులోకి దిగాడు. అయితే ఎంతసేపటికీ ఆయన బయటకు రాకపోవంతో అనుమానం వచ్చిన మరో వ్యక్తి దగ్గరికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. వెంటనే గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు అక్కడి చేరుకొని రాయమల్లు మృత దేహాన్ని గజ ఈతగాళ్లతో బయటకు తీయించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ రావు తెలిపారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలి

కాల్వశ్రీరాంపూర్, మార్చి11: ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి వరి పంటలు కాపాడాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం వారు నిరసన తెలిపారు. ఎస్సారెస్పీ నీళ్లు అందక ఎండిన వరి పంటలు పరిశీలించారు. ఎన్నికలకు ముందు సాగునీరందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మాట మార్చి రైతులను నిలువునా ముంచిందని బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలని కోరారు. నాయకులు పీ రాములు, టీశ్రీధర్, సతీశ్, దిలీప్ ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న జీపీ కార్మికులు

జీతాలు మహాప్రభో

కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల నిరసన

పెద్దపల్లి, మార్చి 11(నమస్తే తెలంగాణ): పంచాయతీ కార్మికులు కన్నెర్రజేశారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కడుపు మండి సోమవారం ఆందోళనకు దిగారు. పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న తమకు గత మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారంలోకి వస్తే నెల నెలా జీతాలను చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, మాట తప్పిందని, పంచాయతీ కార్మికులను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. గ్రామ పంచాయతీ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మెరుపు సమ్మెకు దిగుతామని సీఐటీయూ అనుబంధ గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, వివిధ మండలాల నాయకులు లచ్చయ్య, నరేష్, శ్రీనివాస్, అశోక్, నాగయ్య, లక్ష్మణ్, నరసయ్య, రామస్వామి, రాజయ్య, భాస్కర్, పరశురాములు హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించి వేతనాలను జమ చేయాలన్నారు. అనంతరం పెద్దపల్లి జిల్లా స